# మారిన విలువలు

అశ్విని

క్రిటికీలోనుంచి రంగులు మార్చుకొంటున్న ఆకాశం వెనకనున్న కొండల నునుపునుచూస్తూ నిలుచుంది రేణుక కొండలమీద సంజరంగు నీడలు పడి కిందసముద్రం కొత్త కొత్త రూపాలు ధరిస్తున్నది చూస్తూఉండగానే సూర్యుడు పడమటికివాలిపోయి అంతవరకూ ఉన్న రంగు నీలంగా మారిపోతున్నది

నిట్టూర్పువిడిచి వెనక్కి తిరిగింది రేణుక ఇక్కడికివచ్చిన యీ రెండు నెలలనుంచీ యీ దృశ్యాన్ని చూడటం పరిపాటి అయిందామెకు తన బ్రతుకు కూడా అలాగే నల్లపడి పోతున్నట్టని పిస్తున్నది రాగరంజితమైన మనసు కెవరో నీలిగీతలు వేశారు

గిరి కానీకట్నంలేకుండా తనను పెళ్ళి చేసుకోవటాని కిష్టపడ్డాడని తెలిసి యెంత ఉప్పొంగి పోయింది తను ? చదువూ రూపమూ ఏవీ తనకు చెప్పుకోదగినవి కావు ఎందుకూ పనికిరానివాడు కూడా వేలకువేలు కట్నాలుకోరుతున్న యీ రోజుల్లో అందమైనగిరి యెలాంటి షరతులూలేకుండా తనవాడు కాబోతున్నప్పుడు తనకు ఒళ్లు తెలియని సంతోషం పరవశత్వాన్నే కలిగించింది మధురమైన ఆ తొలిరాత్రి ఆ సుందర మైన సుకుమారమైన మొహంలో అందంగా వంపులు తిరిగిన రేఖలు, అమాయకమైన ఆ చూపులు, కమ్మని ఆ కబుర్లు బతుకునొక తీయని కలలాగా మార్చేసినట్లుగానే భావించుకొంది. కన్నవారింటినుంచి మొదటిసారి భర్త వెంట వస్తున్నప్పుడు, నిత్యదరిద్ర పీడిత మైన, బాధామయమైన ఆ వాతావరణంలో నుంచి సుఖమైన మరోలోకంలోకి వచ్చేస్తున్నట్టుగా అనిపించింది

ఆ కమ్మని కలముందు మసకతెర ఏదో అడ్డంవచ్చినట్టుగా ఉంది, ఎందుకని యిప్పుడు ? వచ్చిన వారంరోజులకు పట్నంచూడటానికి బయలుదేరారిద్దరూ సిటీబస్సులో ఎక్కికూర్చుని పక్కనున్న రేణుకతో అంతులేకుండా కబుర్లు కొట్టి పోస్తున్నాడుగిరి టికెట్ టికెట్ అని రెండుసార్లుపిలిచాడు టికెట్ కలెక్టర్ వినిపించుకోనట్లుగా రేణుకతో ఏదో గబగబా మాట్లాడేస్తున్నాడు రేణుక



సిగ్గుతో కుంచించుకు పోతున్నది ముష్టి రెండణాలకోసం ... నిజంగా వినిపించు కోలేదోమో

వచ్చేటప్పుడు ఇంక ఆపుకోలేక పోయింది.

"ఆ కండక్టర్ టిక్కెట్ డబ్బు లడుగు తుంటే వినిపించుకోరేం ?''

పరిహాసంగాచూసి నవ్వాడు గిరి— గుండెల్లోయేదో కలుక్కుమంది రేణుకకు

"రెండణాలకా యీ నాటకమంతా ''

"రెండూ రెండూనాలుగు... సిగరెట్టు పెట్టిఖరీదు.. '' కొంటెగా చూశాడుగిరి

ఎక్కడో అగాధంలోకి దొర్లి పోతు న్నట్టనిపించింది రేణుకకు

* * *

నాలుగురోజుల తరువాత సాయం కాలం వస్తూ ఓ దంతపుదువ్వెన తెచ్చాడు గిరి. ఎంతో చక్కగాఉంది

"చూడు రేణూ నీకోసం ఏం తెచ్చానో!''

ఉత్సాహంతో అందుకొంది రేణుక. "అబ్బ చాలాబాగుందండీ. ఏ మాత్రం''

''దానిమీదే ఉంటుందిచూడు "

''ఆరు రూపాయలు అబ్బా! ఎందు కండీ యింతఖరీదుపెట్టి కష్టపడి సంపా దించుకొన్న నాలుగుడబ్బులూ యిలా-''

మాట పూర్తిచేయనియ్యకుండా మనో హరంగా నవ్వాడుగిరి

"పిచ్చిదానా కష్టపడిన డబ్బుతో కొనుక్కురావటానికి నేనేమన్నా వెర్రివాడి ననుకున్నావా—''

"మీరు పనిచేస్తున్న షాపుగనుక కాస్త తగ్గించి చౌకగా యిచ్చి ఉంటారు అవునా ?''

నెమ్మదిగా బుగ్గమీద చిటికె వేశాడు "చౌకగా యేం ఖర్మ రాణీగారువచ్చారు గాదూ, ఊరికే యిచ్చారు''

"మీ హాస్యాల కేం గాని నిజంగా చెప్పుదురూ, ఏ మాత్రం?"

కొంచెం ఎఱ్ఱబడిన మొహంతోఅన్నాడు గిరి "తమాషా అయినా కాస్సేపే బాగుం టుందిగాని తరువాత, విసుగెత్తుతుంది. బుఱ్ఱలో తెలివి తేటలూ చేతుల్లో నేర్పూ ఉండాలిగాని యిలాంటి వాటికి డబ్బు ఖర్చుపెట్టే దద్దమ్మ ఎవరు?''

రేణుకకు నెత్తిమీద ఎవరో బలంగా కొట్టినట్టనిపించింది గుండెల్లో యేదో గడకట్టినట్టుగా ఉంది పంచరంగుల తన కలమీద ఏదో నల్లని రంగు పులిమినట్టుగా మనస్సు విలవిల లాడింది

"అయితే నాకేం అక్కర్లేదిది ''

ఒక్కసారి తన కళ్ళల్లోకి చూసి తమాషాగానవ్వాడు గిరి "అదేచిక్కు ఆడ వాళ్లతో వాళ్లకు ఎప్పుడు ఎందుకు కోపం వస్తుందో తెలీదు'' అంటూ సన్నగా ఈల వేసుకుంటూ బావిదగ్గరకు వెళ్లిపోయాడు

రాత్రి కిటికీలోనుంచి వస్తున్న వెన్నెల గిరి మొహంమీది ఉంగరాల వెంట్రుకలతో ఆడుకుంటోంది. చారలు చారలుగా నీడ

రేణుకకు తన బ్రతుకును జ్ఞాపకం చేస్తున్నది నిద్రపోకుండా రేణుక భర్త మొహం చూస్తూ కూర్చున్నది ఎంత చక్కని మొహం? మూసి ఉన్న అతని కళ్లు పసిపాప కళ్ళలాగా నిర్మలంగా ఉన్నాయి ఆ మొహం వెనక అలాంటి దొంగబుద్ధి ఉందని కలలోగూడా ఎవరూ అనుకోలేరు తన దురదృష్టం ఆమెకు కన్నీళ్లు తెప్పించింది ఈ భర్తతో తను జన్మంతా కాపురం చెయ్యాలి కష్టసుఖాల్లో భాగం పంచుకోవాలి రేపు పిల్లలు పుట్టారు వాళ్ళకూ ఈ బుద్ధులే వస్తే... ఒక్కసారి రేణుకకు ఒళ్లు జలదరించింది ఆమె అన్న, తండ్రీ బీదవాళ్ళే కావచ్చు ఇలాంటి దొంగబుద్ధులు వాళ్ళకుంటా యని శత్రువులు గూడా ఊహించుకోలేరు మళ్ళీ భర్త మొహం మీద రేణుక దృష్టి పడింది.

అతను నిద్దట్లో నవ్వుతున్నాడు సన్నని ఆ పెదవులు చక్కని వంపులు దిద్దుకుంటున్నాయి. ఆ కొద్దిపాటి క్రీనీడా లేకపోతే...

భర్త మొహం మీద ముంగురులు సరిదిద్దిం దామె అనుకోకుండా

గిరికి మెలుకువ వచ్చింది. సగం మూసిన కళ్ళతో భార్యను దగ్గరగా లాక్కుని నుదుటిమీద చుంబించాడు ఆ సుఖంలో తన్ను తాను మరిచిపోయింది రేణుక

"ఇంకా నిద్రపోలేదూ పిచ్చి పిన్నా?"

"నాకు మీరు ఓ మాటిస్తారూ?"

"ఏమి టది?"

"ఎప్పుడూ ఏదీ తీసుకురావద్దు ఇంక నుంచీ ఇలా"

అర్థం కానట్టు మొహం ముడుచు కొన్నాడు

"నాకు మీరలా తీసుకురావటం ఇష్టం లేదు మీరు సంపాదించిన దానితోనే నేను సర్దుకోగలను మీరు పెద్దమనిషిగా మంచి వారుగా ఉంటే చాలు దయచేసి ఇకనుంచీ .."

అశాంతితో గిరి పక్కకు ఒత్తిగిల్లాడు. ఆమెకో పాఠం నేర్పితే గాని యింక వదిలేటట్టు లేదు

"ఇదిగో మీకు కోపంవచ్చినట్టుంది మీ మంచికోసమేగా నేనుచెప్పేది మీరు నామాటవినరూమరి—" మొహంమీదికి వంగి ఎంతోలాలనగా పలికింది

"చూడురేణూ నేనూ నీమంచికే చెబుతున్నా చిన్న చిన్న విషయాలను గురించి పెద్దగా ఆలోచించకు. ఇంక నిద్దరపో—"

పతి గాఢపరిష్వంగంలో రేణుక మనస్సు శరీరంగూడా నిద్రపోయినాయి

* * *

రేణుక పొద్దున్నేలేచి స్నానంచేసి కాఫీకలుపుతున్నది. పక్కనేకూర్చున్నాడు గిరి ఏదో సినిమాపాట సన్నగాపాడుతూ. అతనిమాటలాగే పాటకూడా ఎంతో హాయిగావుంది చక్కని సీరెండలో

చల్లని ఆపాటవింటూ రేణుకచేతిలోని గాజుగ్లాసు జార్చేసింది ఒక్కసారిగా పాటఆపి నివ్వుతో చూశాడుగిరి రేణుక భయం భయంగా ముక్కలను తీసేసింది

"మేడమీద భాస్కరంగారు కొత్త రకం స్టీలుకప్పులుకొన్నారు అలాంటివి మీరూ రెండు కొనకూడదూ? చక్కగా అవి పగిలిపోవుగదా, శుభ్రంగాకూడా ఉంటాయి"

"నీవుతల్చుకుంటే అవి మనింట్లోకి రావటం ఎంతసేపు?"

అర్థంకానట్టు చూసిందిరేణు

"భాస్కరంభార్యకు ఎప్పుడూ ఏదో జబ్బేగదూ వాళ్ళబాబ్జీ నువ్వులేకుండా అన్నంగూడా ముట్టుకోడయ్యే"

"అయితే?" అందిరేణు అసహనంతో

"నీకు వాళ్ళింట్లో ఎక్కడేది ఉంటుందో తెలుసు భాస్కరం మతిమరుపుసంగతి ఎవరికితెలియనిదీ? ఒట్టి పరధ్యాన్నం మనిషి"

"ఊఁ...ఇంతకీ?"

"నువ్వోమొద్దువి నీ కాపాటి తెలివి తేటలేఉంటే "రుసరుసలాడుతూ లేచి పోయాడుగిరి

ఆరోజు బాబ్జీకి అన్నంకలుపుతూ వుంటే పక్కనున్న కొత్తకప్పు తళతళలాడింది రేణుకమనసులో కత్తులు దూసినట్టనిపించింది అబ్బ ఎంత భయంకరమైనవారు? అనుకొని వణికి పోయింది నిలువెల్లా.

* * *

రోజులు నెలలుగా వర్తమానం గతంగా మారుతున్నది ఏడున్నర అయినా పొద్దున్న గిరి పక్కమీదనుంచి లేచేసూచనలేం కనిపించటంలేదు ఈ పాటికతడు స్నానంఅదీచేసి షాపుకి వెళ్ళటానికి తయారవుతూ ఉండేవాడు

రేణుక స్నానంచేసింది తలదువ్వుకొని జడలో ఓ మందారపువ్వు ముడుచుకొంది

కాఫీ సిద్ధంచేసింది స్నానానికి నీళ్ళు తోడింది. భర్తదగ్గరకివచ్చింది

దుప్పటిలాగి– "బాగుందండీ యీ నిద్ర షాపుకు వేళయిపోవటంలేదూ? లేవండి ఎనిమిది కావస్తున్నది"

"ఇవాళ ఆలస్యం అయితే ఫర్వాలేదు లెద్దూ, పడుకోనీ"

అతని కంఠంలో యేదో కొత్తగా ధ్వనించింది

"ఏమిటి విశేషం? షాపుకి సెలవా యేమిటి?"

"ఇంకెప్పుడూ సెలవే మనకు"అంటూ తిరిగి పడుకుని ముసుగు పెట్టుకొన్నాడు

రేణుకకు అర్థమైంది నిట్టూర్పు విడుస్తూ "ఇలాంటి దేదో జరుగుతుందని నాకు తెలుసు ఇంకా నయం, పోలీసులకు అప్పజెప్పలేదు, మన పుణ్యం బాగుంది"



"అప్పుజెప్పితే నీమనసు కొంత నిబ్బరంగా ఉండేదనుకొంటా.''

జలజలలాడే కళ్ళతో వెళ్ళిపోయింది రేణు కాసేపుండి గిరీ లేచాడు దొడ్డి వసారా మెట్లమీద చెంపన చెయ్యిపెట్టుకు కూర్చుంది రేణుక

జాలిగా భార్యవంక చూశాడు గిరి "ఇప్పుడేమంత కొంపమునిగి పోయిందని అలా కూచున్నావు ? ఇది కాకపోతే మరోటి.''

. రేణుక మాట్లాడ లేదు

''నాతో మాట్లాడ కూడదను కున్నావా? మధ్య నీకెందుకూ సిగ్గు. లే'' అంటూ పక్కకు వెళ్ళి కూర్చున్నాడు

తీక్షణంగా చూసింది రేణుక. "ఎందుకు మిమ్మల్ని పంపించేశారు ఏం జరిగింది నిజం చెప్పండి ?''

తీవ్రమైన ఆ గొంతుకూ ఆ చూపుకూ కంగారు పడ్డాడు గిరి అనుకోకుండా

కొస్త దూరంగా జరిగి రాజీ చేసుకొనే ధోరణిలో నిమ్మదిగా,

"లేదు రేణూ, ఆ ముసలినక్క కాషియర్‌గాడు చేసినపని యిదంతా. వాడి మూడో పెళ్ళాని కోసం నేనొక పౌడర్ డబ్బా కొట్టేసి యివ్వలేదని వాడి మేడుపు. మానేజరు చెవులు కొరికి ఉంటాడు వాడే!"

మెత్తని అతని మాటలు నమ్మింది రేణు నమ్మక చేసేదేమున్నది?

గిరికి మళ్ళీ తొందరగ్గా ఏ పనీ దొరక లేదు కాళ్ళు బలపాలు కట్టేటట్టు తిరుగు తున్నాడు రేణుకి భర్తను ఓదార్చేది.

"పోనిద్దురూ. ఇప్పుడేం ఖాళీలు లేవు గాబోలు మరి నాలుగు రోజులు పోతే అదే దొరుకుతుంది ఈ మాత్రానికి బెంగ పెట్టుకోకండి"

కాని యీ ఊరడింపు ఆట్టే రోజులు నిలవలేదు ఇంట్లో పప్పులూ ఉప్పులూ నిండుకొంటున్నాయి చిల్లర సామానులు ఇంట్లోంచి ఒక్కొక్కటీ మాయమౌ తున్నాయి ఓ రోజు గిరి మంచి ఖరీదైన పెన్ను తీసుకొచ్చాడు రేణుక ఓసారి నిస్సహాయంగా పెన్ను వంకా భర్తవంకా చూసింది ఎప్పుడు విరుచుకు పడుతుందో అని భయపడుతూనే ఉన్నాడు గిరి కాని రేణుక ఏమీ మాట్లాడకుండా ఇల్లు తుడుచు కొంటున్నది

మంచం మీద కూలబడ్డాడు గిరి

తువ్వాలుతో చేతులు తుడుచుకొంటూ అంది "ఇంట్లో నూనె ఖాళీగా అయి పోయింది"

గిరి సమాధానంగా "ఊఁ" అన్నాడు. అంతే

సాయంకాలం పెన్ను మాయమై బియ్యమూ పప్పులూ నూనెవచ్చాయి—

ఇప్పుడూ రేణుక ఏమీ మాట్లాడ కుండా తెచ్చినసామాను సర్దుకొంటూ కూర్చుంది

"ఉండురేణూ నీకోసం నేనొకటి తెచ్చాను."

తలెత్తి చూసిందిరేణు ఖరీదైన స్నో సీసా ఒకటితీశాడు జేబులోనుంచి గిరి.

"నేనిది నీకోసం 'పాల్ బ్రదర్స్‌లో' డబ్బుపెట్టి కొనితెచ్చాను తెలుసా."

గర్వంగాచూశాడు ఆమె కళ్ళలోకి నిర్లిప్తంగా నవ్వింది రేణుక.

రాత్రిచీకటి దట్టంగా అలుముకు పోయింది సన్నని చినుకులు పడు తున్నాయి కిటికీలోనుంచి చల్లనిగాలి ఉండుండి వేస్తోంది. భర్త తలను సవ రిస్తూఅంది రేణుక

"మీ కెంత ధైర్యం – ఒకవేళ పట్టు బడితే"

పెదిమలుబిగించి మందహాసంతో ఆమె తలలోని జాజిపువ్వులు నిమిరాడుగిరి.

"ధైర్యం మంచిదికాదంటావా రేణూ? నేనూ నీలాగా పిరికివాడినయితే మన మిద్దరం ఈ పాటికి పస్తులుండవలసి

వచ్చేది. నాకేగనుక నీకున్నఛాన్స్ దొరికితేనా !

రేణుగుండె గుబ గుబలాడిందోమారు. అతనిమాట అతనికే అప్పజెప్పాలి

నాలుగు రోజులతరువాత ఛాన్స్ లభించింది హృదయం మూలిగింది కాని భర్త సవాల్ వెనక అది వినిపించుకోలేదు రేణు

భాస్కరం మేడమీద కాపురం ఉంటాడు అతనికి ఏదో ఆఫీసులోపని అతను మహాపరధ్యాన్నం మనిషి ఎప్పుడూ గొడుగో పెన్నో పరుసో ఏదో ఒకటి ఎక్కడో మరిచిపోయి వస్తూ ఉంటాడు భాస్కరంభార్య దీర్ఘరోగి ఎప్పుడూ శాలువా ఒకటి కప్పుకొని మూలుగుతూ ఉంటుంది ఇల్లెలాపోయినా ఆవిడకక్కర్లేదు వాళ్ళబ్బాయి బాబ్జీ... రెండేళ్ళుంటాయి రేణుకదగ్గర చనువెక్కువ వ్యాధిగ్రస్తురాలయిన తల్లిదగ్గర పొందలేని అనురాగంవాడు రేణుకనుండి పొందుతూ ఉంటాడు ఇంకా సంతానవతి కాని కారణంవల్ల రేణు వాడిని ముద్దు చేస్తుంది

సాయంకాలం చీకటిపడుతున్నది... బాబ్జీకి అన్నంతినిపించి మంచంమీద పడుకోబెట్టి నిద్రబుచ్చుతున్నది రేణు ఇల్లంతా నిశ్శబ్దం గోడమీద మేకునుంచి బంగారుగొలుసుతో వాచీ టిక్కు టిక్కుమంటున్నది. ఆ ధ్వని రేణుక గుండెల్లో మోగుతున్నది పంతంగా చూచిన భర్త చూపూ నవ్వూ జ్ఞాపకంవచ్చాయి చప్పున తీసి దాన్ని పమిటలో దాచుకొంది

కాని' పట్టుబడితే ... రేణుక కాభయం లేదు భాస్కరం పొద్దుపోయిగాని యిల్లు చేరడు పయిగా అతని మతిమరుపు సంగతి అందరికీ తెలుసు దాదాపు అయిదారు నెలలనుంచీ వస్తూ ఇంట్లో మనిషిగా మెలుగుతున్న రేణుకనెవరూ అనుమానించటానికి గూడా ఆస్కారంలేదు

కంపించే కాళ్ళతో ఎలాగో తమవాటా చేరుకొందిరేణుక. ఏదో తెలీని ఉద్వేగం ఆమెను నిలవ నీయటంలేదు. ఊపిరి అతివేగంగా వస్తోంది ఆ చిన్న వస్తువు నోసారి స్పృశించిందామె తొలిసారి పురుషస్పర్శలో గూడా అలాంటి అనుభూతి కలిగిన జ్ఞాపకంలేదు రేణుకకు.

చిన్నబోయిన మొహంతో పొద్దుపోయి వచ్చాడు గిరి ఆ రోజు అతనికేం లాభించినట్టుగా లేదు

విజయ దీప్తితో వెలిగిపోతున్న రేణును చూసి తృళ్ళిపడ్డాడు గిరి

"ఏం సంగతి మహాహుషార్‌గా ఉన్నావే?''

తలుపు గడియపెట్టింది భర్త మెడను రెండు చేతులతో కౌగిలించుకొని తియ్యని కంఠంతో అంది "మీ కెందుకూ అసూయ మీరూహుషార్‌గా ఉండండి చల్లని యీ రేయి మనము సరదాగా

తేలిపోదమ్మోయీ" చివరిమాట పాటలా పాడింది

కాస్త చిరాకు పడ్డాడు గిరి "కవిత్వం వదిలిపెట్టుదూ కాసేపు సంగతేమిటి అసలు ?''

రేణుక ఉల్లాసంగా "ఓ క్షణం ఆగండి సార్ అంతకంగా రెందుకు అయినా మీమగవాళ్ళే యింత లెద్దురూ ప్రతి దానికీ తొందరపడి పాడు చేస్తారు ముందు భోజనానికి లేవండి.''

భోజనాలు ముగించారు. రేణుక భర్త పక్కనే పడుకుంది నిశ్చింతగా దీపం వెలుగుతూనే ఉందింకా

''ఏమిటి ఆ లైటు అలా తెల్లవార్లూ ఉంటుందా ?''

రేణుక మధురంగా నవ్వింది "ఉంటే ఏం పోయిందిలేద్దురూ ఇంతలో ఆర్పే స్తానులెండి ఇప్పుడే మీ ఎడమచెయ్యి ఓసారి యిలాయివ్వండి.''

''ఏం, రేఖలు చూస్తావా ?''

''అవును'' అంటూ జాకెట్టులోనుంచి వాచీతీసి "ఏదీ, మీచేతికి సరిపోతుందేమో చూస్తాను'' అంది

"హరే రామ్ ఎక్కడిది నీ కిది''

తేలిపోతున్న గొంతుతో అంది ''అదంతా మీ కనవసరంసార్ ఇంతకూ మీ చేతికి సరిపోయిందా లేదా ?''

ఉన్నట్టురండి లేచివెళ్ళి లైటుతీసి వచ్చి భర్తను గాఢంగా కౌగిలించుకొంది

ఈ రాత్రి ఆమె కె అవమానమూ సిగ్గూ సంకోచం లేవు ప్రపంచాన్నామె జయించింది

''ఏమండీ — అలా మాట్లాకుండా పడుకున్నా రేం. మీకది నచ్చలేదా?''

ఇప్పుడామె అతని నిజమైన సహచారిణి ఇన్నాళ్ళూ గిరి యీ రోజు కోసమే యెదురు చూస్తున్నాడు నిజానికి అత నిప్పుడు స్వర్గానందాన్ని పొంది ఉండాలి కాని కాని వెచ్చని భార్య కౌగిలి అతని నేమీ కదిలించలేక పోయింది ప్రపంచంలోని సౌందర్యం మాధుర్యం అంతా మాయమై పోయిన ట్టనిపించింది తన కంఠాన్ని కౌగిలించు కొన్న ఆ రెండు చేతులూ ఇదివరకటి స్వచ్ఛమైన సన్నని గాజుల చేతులు కావు వాటిమీద యిప్పుడు మచ్చపడింది అవి తమ సౌరభాన్ని గోల్పోయాయి శాశ్వతంగా

